క్లుప్తంగా

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మహేష్

భానుపురి : పేద విద్యార్థులకు కావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పి.మహేష్ కోరారు. సోమవారం సూర్యాపేట పట్టణంలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పది నెలలు గడుస్తున్నా నేటికీ విద్యారంగ సమస్యలపై దృష్టి పెట్టలేకపోయిందన్నారు. విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని కేటాయించని కారణంగా అనేక సమస్యలు పేరుకుపోయాయని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో ప్రైవేట్ యాజమాన్యాలు విద్యార్థులను బలవంతంగా ఫీజులు కట్టేలా ఒత్తిడి చేసి వేధింపులకు గురిచేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి, నాయకులు కె.శ్రీనివాస్, డివిజన్ కార్యదర్శి పిడమర్తి భరత్, మహేష్, పవన్, జీవన్, గణేష్, నవీన్, రంజిత్ పాల్గొన్నారు.

గిరిజనుల భూములు లాక్కోవడం సరికాదు

తుంగతుర్తి : ఫార్మా విలేజ్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల గిరిజనుల భూములను లాక్కోవడం సరికాదని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. లగచర్లలో గిరిజనుల భూములను గుంజుకోవడంతో వారు కడుపుమంటతో తిరుగుబాటు చేస్తే వారిని విచక్షణ రహితంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గిరిజన కుటుంబాలను అన్ని రకాలుగా ఆదుకోవాలని, కేసులను బేషరతుగా ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు లకావత్ యాకునాయక్, భూక్య రవినాయక్, కుంటపెల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

తిరుమలగిరి : రైతులు వరి కొయ్యలను తగులబెట్టడం వల్ల నష్టం వాటిల్లుతుందని తిరుమలగిరి మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం తాటిపాముల గ్రామంలో వరి కొయ్యలను తగులబెట్టకూడదని రైతులకు అవగాహన కల్పించారు. వరి కొయ్యలను భూమిలోనే కలియదున్నడం వల్ల భూసారం పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉర్సుకు ఏర్పాట్లు



దర్గాకు రంగులు వేస్తున్న పెయింటర్స్

అర్వపల్లి : అర్వపల్లి శివారులోని హజ్రత్ ఖాజా నసీరుద్దీన్ బాబాదర్గా ఉర్సుకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. రంగులు వేసే పనులను వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో చేపట్టారు. దర్గాకు రంగులు వేసే పనులను మొదలుపెట్టారు. అలాగే విద్యుత్ లైట్లు వేసే పనులు కూడా జరుగుతున్నాయి. ఈ నెల 29 నుంచి మొదలయ్యే ఉర్సు నాటికి అన్ని పనులు పూర్తి చేయనున్నట్లు వక్ఫ్ బోర్డు ఉమ్మడి జిల్లా ఇన్‌స్పెక్టర్ మహమూద్, దర్గా ముజావర్ అలీ తెలిపారు.

శిథిలమైన హాల్.. పొంచిఉన్న ప్రమాదం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం అడివెంల గ్రామంలో బొడ్రాయి వద్ద 25 ఏళ్ల కిందట నిర్మించిన కమ్యూనిటీ హాల్ పూర్తిగా శిథిలమైంది. మొదట దీనిలో గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని నడిపించారు. అయితే గ్రామ పంచాయతీకి సొంత భవనం నిర్మించాక ఇందులో నుంచి కార్యాలయాన్ని మార్చారు. ఆ తర్వాత ఆరోగ్య ఉపకేంద్రం నడిపిస్తున్నారు. అయితే ఈ భవనం చువ్వలు తేలి పెచ్చులూడిపడుతున్నాయి. భవనం ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. వైద్య సిబ్బంది కూడా తప్పని పరిస్థితుల్లో అందులో విధులు నిర్వర్తిస్తున్నారు. ఇప్పటికైనా శిథిలమైన ఈ భవనాన్ని తొలగించి కొత్తది నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



పెచ్చులూడుతున్న కమ్యూనిటీ హాల్ స్లాబ్

అందని అంగన్‌వాడీ సేవలు

- మక్తాకొత్తగూడెంలోని కేంద్రంలో టీచర్, ఆయా పోస్టులు ఖాళీ
- ఇతర గ్రామాల టీచర్లకు ఇన్‌చార్జ్ బాధ్యతలు
- చిన్నారులు, లబ్ధిదారులకు అందని పూర్తిస్థాయి సేవలు



మక్తాకొత్తగూడెంలో సరుకులు పంపిణీ చేస్తున్న ఇన్‌చార్జ్ అంగన్‌వాడీ సిబ్బంది

ఆత్మకూర్ (ఎస్) : ఆత్మకూర్ మండల పరిధిలోని మక్తాకొత్తగూడెంలో చిన్నారులు అంగన్వాడీ కేంద్రానికి నోచుకోలేకపోతున్నారు. గత కొన్ని నెలలుగా అంగన్వాడీ కేంద్రం నిర్వహణ లేకపోవడంతో చిన్నారులు ఇళ్లకే పరిమితమవుతున్నారు. బాలింతలు, గర్భిణులు తమకు వచ్చే సరుకులను నెలకొకసారి తీసుకొని వాడుకుంటున్నారు. అంగన్వాడీ కేంద్రం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే అంగన్వాడీ కేంద్రాన్ని తెరిపించాలని గర్భిణులు బాలింతలు కోరుతున్నారు.

ప్రమోషన్‌తో ఖాళీ అయిన టీచర్ పోస్టు..

ఆత్మకూరు మండలం మక్తాకొత్తగూడెం గ్రామంలో ఉన్న అంగన్వాడీ టీచర్‌కు ఇటీవల ప్రమోషన్ వచ్చింది. దీంతో నాటినుంచి ఆ కేంద్రాన్ని ఆయానే నిర్వహించింది. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రానికి తీసుకురావడం.. ఇంటికి పంపించడంతోపాటు బాలింతలు, గర్భిణులకు వచ్చే సరుకులను అందించడం లాంటివి చేసేవారు. అయితే ఆయాకు 60 ఏళ్లు నిండడంతో ప్రభుత్వం తీసుకొచ్చిన రిటైర్డ్‌మెంట్ విధానాన్ని బట్టి ఆమెను 8 నెలల క్రితం తొలగించారు. నాటినుంచి ఈ కేంద్రానికి ఇటు అంగన్వాడీ టీచర్, ఆయా లేకపోవడంతో కేంద్రం నిర్వహణ ఆగిపోయింది.

ఇన్‌చార్జ్ టీచర్లతో నిర్వహణ..

మక్తాకొత్తగూడెం గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో టీచర్ గాని, ఆయా గాని లేకపోవడంతో పక్క గ్రామాల అంగన్వాడీ టీచర్లకు ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పజెప్పారు. ఆయా గ్రామాలలో బాధ్యతలు నిర్వహిస్తున్న అంగన్వాడీ టీచర్లు నెలకొకసారి ఈ గ్రామానికి వచ్చి బాలింతలు, గర్భిణులు, చిన్న పిల్లలకు ఇచ్చే సరుకులు ఇచ్చి వెళ్లిపోతున్నారు. కాగా చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పే టీచర్లు లేకపోవడంతో పిల్లలంతా ఇంటి వద్దనే ఉంటున్నారు.

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు



మాట్లాడుతున్న వంగవీటి రామారావు

భానుపురి : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను స్థానిక కేంద్ర గ్రంథాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కవి సమ్మేళన కార్యక్రమం ఏర్పాటు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కవులు తమ కవితలతో అలరించారు. అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు వంగవీటి రామారావు మాట్లాడారు. సూర్యాపేట జిల్లా కళలను పుట్టినిల్లు లాంటిదని, రాష్ట్రవ్యాప్తంగా జిల్లాకు మంచి గుర్తింపు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సుధాబ్యాంక్ చైర్మన్ పెద్దిరెడ్డి గణేష్, రోజా, జి.వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సహాయ గ్రంథ పాలకులు వడ్డే శ్యాంసుందర్‌రెడ్డి, గ్రంథ పాలకులు కే.విజయభాస్కర్, సైదా, వెంకట్, నిర్మల, లచ్చిమి, శ్రీనివాస్, రంగారావు, ఇతర గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయాలని వినతి



కలెక్టరేట్‌లో అధికారికి వినతిపత్రం అందజేస్తున్న కేవీపీఎస్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

సూర్యాపేట : తెలంగాణ రాష్ట్రంలోని పలు కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో సోషల్ వెల్ఫేర్, గిరిజన సంక్షేమ శాఖల సహకారంతో బెస్ట్ అవైలబుల్ స్కీం కింద దాదాపు 25 వేలమంది దళిత పిల్లలు చదువుకుంటున్నారని, వీరి ఫీజులను తక్షణమే చెల్లించాలని ఎస్‌ఎఫ్‌ఐ, కేవీపీఎస్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కోట గోపి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీకాంత్ వర్మ, భానోత్ వినోద్ కుమార్ మాట్లాడారు. ప్రతి ఏటా ఫీజులు చెల్లించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం గత రెండు సంవత్సరాలుగా రూ.175 కోట్లు చెల్లించలేదని తెలిపారు. దీంతో దళిత, గిరిజన విద్యార్థుల చదువులకు కోత పడే అవకాశం ఉందన్నారు. వెంటనే బకాయిలు చెల్లించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సతీష్, మనోహర్, అనిల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రుల దోపిడీని అరికట్టాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

భానుపురి : ప్రైవేటు ఆస్పత్రుల ఫీజుల దోపిడీని అరికట్టాలని, ప్రభుత్వ హాస్పిటళ్లను బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మారసాని చంద్రకళ, కొత్తపల్లి రేణుక ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేట్ హాస్పిటళ్ల దోపిడీని అరికట్టాలని కోరుతూ పీవైఎల్, పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా దశలవారీ చేపడుతున్న కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్లను సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ హాస్పిటళ్లలో మెరుగైన వైద్యం అందకపోవడంతో ప్రజలు తప్పని పరిస్థితిల్లో ప్రైవేట్ హాస్పిటళ్లను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. దీనిని ఆసరాగా చేసుకుని ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా సహాయ కార్యదర్శి సంతోషి మాత, జిల్లా నాయకులు ఐతరాజు పద్మ, కట్ట కల్పన, రేణుక, పీవైఎల్ నాయకులు జాన్ సుందర్, రమేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మద్దిరాల : మండల పరిధిలోని కుక్కడం (రావులపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్), ముకుందాపురం, రెడ్డిగూడెం గ్రామాలకు చెందిన 11కేవీ ఫీడర్‌కు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున ఆయా గ్రామాలకు మంగళవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించగలరని కోరారు.

పాఠశాలలకు రాగులపాడి, బెల్లంపాడి పంపిణీ

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలోని 28 ప్రభుత్వ పాఠశాలలకు రాగుల పాడి, బెల్లంపాడి ప్యాకెట్లు రాగా సోమవారం స్థానిక ఎమ్మార్సీ నుంచి పాఠశాలల వారీగా పంపిణీ చేశారు. వచ్చే నెల వరకు పాఠశాలల్లో రాగిజావ పంపిణీకై 125 కిలోల రాగి పొడి, 125 కిలోల బెల్లం ప్యాకెట్లు వచ్చాయని ఎంఈఓ బి.బాలునాయక్ తెలిపారు. మండలంలోని 1508 మంది పిల్లలకు రెండు రోజులకోసారి రాగిజావ అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఏకలక్ష్మి, ఏడుకొండలు పాల్గొన్నారు.

ఆలయాల్లో కార్తీక సోమవారం పూజలు



హనుమాన్ ఆలయంలో వెలిగించిన దీపాలు



నూతనకల్‌లో పూజలు చేస్తున్న మహిళలు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని సూర్యక్షేత్రం ఆవరణలో ఉన్న కార్యసిద్ధి వీరహనుమాన్ ఆలయంలో కార్తీకమాస వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అయ్యప్ప, హనుమాన్, శివ మాలధారులు ప్రతిరోజు ప్రత్యేక పూజలు జరుపుతున్నారు. కార్తీక సోమవారం సందర్భంగా రాత్రి దీపాలు వెలిగించి పూజలు చేశారు.

నూతనకల్ : కార్తీక మాసం సందర్భంగా నూతనకల్ మండల కేంద్రంలో సోమవారం మహిళలు శ్రీపార్వతీ శంభులింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఉసిరిచెట్టు, విష్ణు తెల్ల జిల్లేడు చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వనభోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మహిళలు పన్నాల రమ మల్లారెడ్డి, బద్దం జ్యోతి, మాసిరెడ్డి పూలమ్మ, యాస మంజుల, ఆకుల మమత, యాస జ్యోతి, సామ మంజుల పాల్గొన్నారు.

సీపీఎం బహిరంగ సభ కరపత్రాల ఆవిష్కరణ



బహిరంగ సభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఎం మండల కార్యదర్శి గుంజా వెంకటేశ్వర్లు

పెన్‌పహాడ్ : ఈ నెల 29న సూర్యాపేట జిల్లా కేంద్రంలోని గాంధీపార్కులో జరిగే సీపీఎం జిల్లా 3వ మహాసభలకు కార్యకర్తలు, ప్రజలు పెద్దసంఖ్యలో తరలిరావాలని సీపీఎం మండల కార్యదర్శి గుంజా వెంకటేశ్వర్లు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వీరబోయిన రవి పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని అనాజీపురం గ్రామంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 12 సంవత్సరాల తరువాత సూర్యాపేట పట్టణంలో సీపీఎం జిల్లా మహాసభలను జరుపుకోవడం సంతోషదాయకమన్నారు. ఈ బహిరంగ సభకు సీపీఎం పోలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకారత్, బీవీ రాఘవులు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మీ హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు లక్కపాక ముత్తయ్య, కొండ లింగయ్య, లక్ష్మయ్య, నెమ్మాది రాములు, మల్లయ్య, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఏడాదిలో ఎనిమిది సెల్‌ఫోన్‌ల రికవరీ



సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న ఎస్‌ఐ బాలకృష్ణ

అర్వపల్లి : ఈ ఏడాది ఎనిమిది సెల్‌ఫోన్‌లను రికవరీ చేసినట్లు ఎస్‌ఐ సీహెచ్.బాలకృష్ణ తెలిపారు. అర్వపల్లికి చెందిన నల్లగుంట్ల శరత్‌కుమార్ ఆరు నెలల కిందట తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకోగా వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదుచేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజానగరం గ్రామానికి చెందిన వ్యక్తి నుంచి రికవరీ చేశారు. పోలీసులు ఆ సెల్‌ఫోన్‌ను శరత్‌కు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం అప్పగించారు. ఎవరైనా సెల్ పోగొట్టుకున్నా, చోరీ జరిగినా వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించారు. లేదా సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేసుకోవచ్చని చెప్పారు. సెల్ పోగొట్టుకున్న వారు తప్పనిసరిగా ఆధార్‌కార్డు, ఐఎంఈఆర్ నంబర్, మీసేవా చలానా నంబర్ తీసుకొనిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్టేషన్‌రైటర్ డి.రాజ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



పెన్‌పహాడ్ : సింగారెడ్డిపాలెంలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏఓ అనిల్‌కుమార్



మద్దిరాలలోని కొనుగోలు కేంద్రంలో రైతుల ట్రక్ షీట్లు పరిశీలిస్తున్న తహసీల్దార్ అమీన్‌సింగ్



అర్వపల్లి : కొనుగోలు కేంద్రంలోని ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న ఏఈఓ సత్యం

మద్దిరాల : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన ట్రక్ షీట్లను పరిశీలించి మాట్లాడారు. ధాన్యం అమ్మిన రెండు రోజుల్లోనే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం వారి ఖాతాల్లో డబ్బులు జమ చేస్తుందని తెలిపారు. సన్నాలకు కూడా బోనస్ డబ్బులు పడుతాయని, వాటి విషయంలో ఎలాంటి అనుమానం వద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో సీసీ నాగార్జున్ రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని ఆరబెట్టి, శుభ్రం చేసి తేవాలి

అర్వపల్లి : రైతులు ధాన్యాన్ని 17 శాతం లోపు తేమ ఉండేలా చూసుకొని కేంద్రాలకు తేవాలని తిమ్మాపురం క్లస్టర్ ఏఈఓ నేరెళ్ల సత్యం కోరారు. సోమవారం తిమ్మాపురం, అడివెంల, కుంచమర్తి తదితర గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలించారు. 17 శాతం వరకు తేమ ఉన్న ధాన్యం రాశులను గుర్తించి కాంటాలకు అనుమతించారు. ఈ కార్యక్రమంలో సంఘబంధం అధ్యక్షురాలు బొడ్డు స్వప్న, సీసీ నగేష్, వీఓఏ దేవరకొండ విజయ, బొల్లం పరిమిత, ఉమాదేవి, కోటిరెడ్డి పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని మండల వ్యవసాయ అధికారి అనిల్‌కుమార్ అన్నారు. సోమవారం సింగారెడ్డిపాలెం గ్రామంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి రోజూ వడ్లను ఎండబోసి శుభ్రం చేయడంతో తేమశాతం 17శాతంలోపు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శ్రావణి, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు ఓటుహక్కు నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న తీకుళ్ల సాయిరెడ్డి

మద్దిరాల : ఈ నెల 23 నుంచి ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదు కార్యక్రమం ప్రారంభం కానుందని, అర్హులైన ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఏపీయూఎస్, టీపీయూఎస్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు తీకుళ్ల సాయిరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంతోపాటు ముకుందాపురం, పోలుమల్ల, గోరెంట్ల గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో వరంగల్ - ఖమ్మం - నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు హక్కుపై అధ్యాపకులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. 2019లోని ఎమ్మెల్సీ ఓటరు జాబితా పూర్తిగా రద్దు చేయబడినందున ప్రతి ఒక్కరూ తప్పకుండా ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు కావాలని సూచించారు. మార్చిలో జరిగే వరంగల్ - ఖమ్మం - నల్లగొండ ఎమ్మెల్సీ ఎన్నికల్లో జాతీయవాదులకు మద్దతు తెలపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ తండు వెంకటనారాయణ, ఉపాధ్యాయులు రమేష్, వెంకన్న, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఏపీయూఎస్, టీపీయూఎస్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు తీకుళ్ల సాయిరెడ్డి కోరారు. సోమవారం నూతనకల్, తాళ్లసింగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులకు నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. త్వరలో జరిగే వరంగల్ - ఖమ్మం - నల్లగొండ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో జాతీయవాదులకు మద్దతు ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వేబ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేదెప్పుడో..



ఎర్రపహాడ్ క్రాస్ రోడ్డు వద్ద అసంపూర్తిగా నిలిచిన వేబ్రిడ్జి నిర్మాణ పనులు

నూతనకల్ : మండల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన వేబ్రిడ్జి నిర్మాణం పిల్లర్లకే పరిమితమైంది. వేబ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేది ఎన్నడో అని రైతులు ఎదురుచూస్తున్నారు. మండల పరిధిలోని ఎర్రపహాడ్ క్రాస్ రోడ్డు వద్ద 365 జాతీయ రహదారి వెంబడి 80టన్నుల సామర్థ్యం కలిగిన వేబ్రిడ్జి నిర్మాణం కోసం గత చైర్మన్ రూ.5లక్షలను చెక్కు ద్వారా డ్రా చేశారు. పిల్లర్ల వరకు నిర్మాణాన్ని చేపట్టారు. ఆ సమయంలో చైర్మన్‌పై అవినీతి ఆరోపణలు రావడంతో పదవి కోల్పోయాడు. ఆ తర్వాత వేబ్రిడ్జి నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి.

అనుమతులు లేకుండా ఇష్టారీతిన..

వేబ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వ ఇంజనీరింగ్ అధికారులచే అంచనా వేసి నిబంధనల ప్రకారం పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించాల్సి ఉంటుంది. అంతేకాకుండా జిల్లా కో ఆపరేటివ్ అధికారి నుంచి అనుమతి పొందాల్సి ఉంటుంది. కానీ మండల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ ఎలాంటి అనుమతులు తీసుకోకుండా తన ఇష్టానుసారంగా వ్యవహరించాడని పలువురు అధికారులు తెలుపుతున్నారు. ప్రస్తుతం అసంపూర్తిగా ఉన్న నిర్మాణాన్ని పూర్తి చేయడానికి సహకార సంఘం అధికారులు ప్రయత్నాలు కొనసాగిస్తున్నప్పటికీ నిబంధనల ప్రకారం కొలతలు లేకపోవడంతో ఆటంకం ఏర్పడుతోంది. ఇష్టారీతిన నిర్మించడం వల్ల పిల్లర్లను పూర్తిగా తొలగించాల్సి వస్తుందని అధికారులు వాపోతున్నారు. వేబ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి సదరు భూమి యజమానితో కూడా ఎలాంటి అగ్రిమెంట్ చేసుకోలేదని తెలుస్తోంది. దీంతో ప్రస్తుతం సంబంధిత భూమి యజమాని మా భూమిలో నిర్మాణం చేపట్టవద్దని అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ విషయమై సీఈఓ సమ్మెట వెంకన్నను వివరణ కోరగా.. జిల్లా అధికారుల అనుమతి తీసుకోకుండా గత చైర్మన్ మొండిగా వ్యవహరించడం వల్ల వేబ్రిడ్జి నిర్మాణం పనికిరాకుండా పోయిందని తెలిపారు. సహకార సంఘం అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని, వేబ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

ప్రజా ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం

చిలుకూరు : ప్రజా ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. పార్టీ నాయకుడు కీసర గాంధీ వర్ధంతి సందర్భంగా సోమవారం చిలుకూరు మండలం నారాయణపురంలో ఆయన స్మారక హాల్‌ను (సీపీఐ కార్యాలయం) ప్రారంభించి మాట్లాడారు. పార్టీ కార్యాలయాలే ప్రజా సమస్యలపై పోరాడే ఉద్యమ కేంద్రాలు కావాలని అన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు పార్టీ నాయకులు అండగా ఉండాలని సూచించారు. అంతకుముందు గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించి పార్టీ జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు దొడ్డా నారాయణరావు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్, జిల్లా, మండల కార్యదర్శులు బెజవాడ వెంకటేశ్వర్లు, మండవ వెంకటేశ్వర్లు, నాయకులు యాల్లావుల రాములు, మేకల శ్రీనివాసరావు, ధనుంజయనాయుడు, పోకల వెంకటేశ్వర్లు, గుండు వెంకటేశ్వర్లు, బూర వెంకటేశ్వర్లు, నంద్యాల రామిరెడ్డి, దొడ్డా వెంకటయ్య, చేపూరి కొండలు, కీసర వెంకటేశ్వర్లు, నాగరాజు, కందుకూరి శ్రీను, యాల్లావుల రమేష్ పాల్గొన్నారు.

లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే విత్తనాలు కొనాలి

నాగారం : రైతులు తప్పనిసరిగా ప్రభుత్వ గుర్తింపు పొందిన డీలర్ దుకాణాల్లోనే విత్తనాలను కొనుగోలు చేయాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణకాంత్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన తరువాత రశీదును, విత్తన కంపెనీ ప్యాకెట్‌కు సంబంధించిన లాట్ నంబర్ వివరాలను సీజన్ ముగిసే వరకు జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని సూచించారు. బిల్లు లేకుండా విత్తనాలు కొనుగోలు చేస్తే భవిష్యత్తులో ఆ విత్తనం ద్వారా ఏదైనా సమస్య వచ్చినట్లయితే ఫిర్యాదు చేసే అవకాశం ఉండదని అన్నారు. నవంబర్ 15 నుంచి డిసెంబర్ 15 వరకు వరి నారు పోసుకొనుటకు అనుకూలమని తెలిపారు. ఈ సమావేశంలో ఏఈఓలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే



మద్దిరాలలో ఇంటింటి కుటుంబ సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్



అర్వపల్లి : తిమ్మాపురంలో సర్వేలో పాల్గొన్న ఎంపీఎస్‌ఓ

మద్దిరాల : పట్టణాలకు బతుకుదెరువు కోసం వలస వెళ్లిన వారు తమ వివరాలను ఎన్యుమరేటర్లకు అందజేయాలని తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని ఆయా గ్రామాలలో నిర్వహించిన సమగ్ర సర్వేలో పాల్గొని మాట్లాడారు. గ్రామాలలో దాదాపు సర్వే పూర్తికావొచ్చిందని తెలిపారు. కానీ వలస వెళ్లిన వారి ఇళ్లకు తాళాలు వేసి ఉండడం వల్ల సర్వే చేయలేకపోతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్యుమరేటర్లు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

81 శాతం సర్వే పూర్తి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలో సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే 81శాతం పూర్తయినట్లు తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఇంటింటి సర్వేను తిమ్మాపురం, అర్వపల్లి తదితర గ్రామాల్లో పరిశీలించి మాట్లాడారు. మండలంలో 9,828 కుటుంబాలు ఉండగా ఇప్పటి వరకు 7,950 కుటుంబాల సర్వే పూర్తయినట్లు చెప్పారు. మిగిలిన కుటుంబాల సర్వే కూడా త్వరలో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఎస్‌ఓ సైదిరెడ్డి, ఎన్యుమరేటర్ జీడి రాధ పాల్గొన్నారు.

డిసెంబర్ 1న మాలల సింహగర్జన సభ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

తిరుమలగిరి : డిసెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించే మాలల సింహగర్జన సభ కరపత్రాలను సోమవారం తిరుమలగిరిలో ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి సూర్యాపేట జిల్లా కో కన్వీనర్ గంట యాకూబ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాలలు ఐక్యంగా ఉండి పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో జరిగే సింహగర్జన సభకు నియోజకవర్గంలోని మాలలు అత్యధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి మండల అధ్యక్షుడు గంట సందీప్, ఉపాధ్యక్షుడు పెరమళ్ల జాన, జాన్ వెస్లీ, బందెల శేఖర్, బలిక నాగేష్, మల్లయ్య, మద్దెల ప్రభుదాస్, గంట సాల్మన్, గడ్డి దిలీప్, సుధాకర్, ప్రకాష్, విక్టర్, ఉయ్యాల భిక్షం, వేల్పుల వెంకన్న, చింటూ పాల్గొన్నారు.